# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలో వాటర్ స్పోర్ట్స్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయను కోరారు.**

**2.** **ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**3.** **ఎన్నికల హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు.**

**4.** **ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.**

**5.** **రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో రెండో రోజు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి ఈ రోజు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రీడారంగ అభివద్ధికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.అమరావతి కృష్ణా నదీ తీరంలో జాతీయ జల క్రీడల శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అవకాశాలున్నాయని చెప్పారు. తిరుపతి, రాజమహేంద్రవరం, కాకినాడ, నరసరావుపేటలో ఖేలో ఇండియా పథకం కింద మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.. ఖేలో ఇండియా మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ 2025ను రాష్ట్రంలో నిర్వహించేందుకు అవకాశం ఇవ్వడంపై కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ఇదిలా ఉండగా ఈ మధ్యాహ్నం జలశక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాలపై జరిగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు నాయుడు సమావేశమవుతారు. రాత్రి భారత పరిశ్రమల సమాఖ్య –సీఐఐ నిర్వహించే కార్యక్రమంలో స్వర్ణాంధ్రప్రదేశ్ టాస్క్‌ఫోర్స్ నివేదిక విడుదల చేస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, 67 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద 10 వేల కోట్ల రూపాయలను జమ చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకంతో పాటే అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ప్రజా సమస్యలకు మద్దతుగా పోరాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేక కార్యక్రమాలను చేపట్టిందని జగన్‌మోహన్ రెడ్డి తెలుపుతూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖలపై నిన్న మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “మాధ్యమిక విద్య బోర్డును పునర్ వ్యవస్థీకరించి, నిపుణులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆవిష్కరణ కార్యకలాపాలను నిర్వహించాలని తెలిపారు.

---------------------------

రైతుబజార్లలో వినియోగదారులకు నిర్ణిత ధరల్లోనే కూరగాయలను విక్రయంచాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. విజయవాడలోని గాంధీనగర్ రైతు బజార్‌ను ఆయన ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేసి కూరగాయల విక్రయ దుకాణాలు, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారులతో మాట్లాడి రైతు బజారు ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, కూరగాయల ధరల వివరాలను తెలిపే సూచిక తప్పనిసరిగా ఉండాలన్నారు. వినియోగదారులను జనపనార బ్యాగులు ఉపయోగించేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

---------------------------

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను వేగంగా పరిష్కరించుకోవచ్చని ప్రకాశం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్ద ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో మధ్యవర్తిత్వంపై ఈరోజు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్ద కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు మధ్యవర్తిత్వంపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలుపుతూ,

వాయిస్...27 సెకన్లు

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు ఆణివార ఆస్థానాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మలయప్పస్వామి వారు ఉభయదేవేరులతో సర్వభూపాల వాహనంపై దర్శమిచ్చారు. మరో పల్లకిలో సర్వ సైన్యాధ్యక్షుడు విష్వక్సేనులు దక్షిణ అభిముఖంగా వేంచేపు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులతో పాటు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. జీయర్లు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కాగా ఈ సాయంత్రం 6 గంటలకు పుష్పపల్లకి వాహనంపై మలయప్పస్వామి ఊరేగనున్నారు.

---------------------------

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రస్తుత పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులు, కొత్త ప్రాజెక్టులకు నివేదికల తయారీ, ఇతర రాష్ట్రాల్లో ప్రచారం, వంటి అంశాలపై అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అఖండ గోదావరి, గండికోట, సూర్యలంక బీచ్ వంటి పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు నంద్యాల జిల్లాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. 696 కోట్ల రూపాయలతో చేపట్టిన హంద్రీనీవా మొదటి దశ విస్తరణ పనులతో కాలువ ప్రవాహ సామర్థ్యం 3850 క్యూసెక్కులకు పెరిగిందని, తద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఆయకట్టుకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుందని అధికారులు తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతిలోని వినాయకసాగర్ ప్రాంతంలో కేంద్రప్రభుత్వ నిధులతో నిర్మించిన నీటి శుద్ధి ప్లాంట్, స్విమ్మింగ్ పూల్‌ను కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగు నీటిని ప్రజలకు అందించేలా నూతన ఆర్ ఓ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 74 పాయింట్ల లాభంతో 82 వేల 644 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 15 పాయింట్ల లాభంతో 25 వేల 210 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

=====================